కామెడీ కథ

# మెరుపుతీగ

బస్టాపులో నిలబడి వున్నాడు సుబ్బారావు. 4వ నెంబర్ బస్సు కోసం ఎంతసేపటి నుండో ఎదురుచూస్తున్న అతను విసుగ్గా తలపంకించి, తల(తిప్పిన వైపు అలా చూస్తూ వుండిపోయాడు. కారణం ఒక 'మెరుపుతీగ' బస్టాండు వైపే వస్తున్నది.

లేత గులాబీ రంగు చుడీదార్‌లో తాజా గులాబీలా మెరిసిపోతూ వచ్చి తన (ప్రక్కనే నిలబడడంతో ఒక్కసారిగా తత్తరపాటును అణచుకుంటూ ఇన్‌షర్ట్, (క్రాఫ్ సరిచేసుకున్నాడు సుబ్బారావు. ఆమెను ఓరకంటనే గమనిస్తూ బస్సు కోసం ఎదురుచూస్తున్నాడు, బస్సు ఇంకా రాకపోతే బావుండునని మనసులో అనుకుంటూ.

(ప్రక్కనే వుండి తన వైపు దొంగ చూపులు చూస్తున్న సుబ్బారావు వంక చూసి ఒక చిన్న నవ్వు నవ్వింది ఆమె. ఆమా(త్రానికే మెలికలు తిరిగిపోయింది సుబ్బారావు మనసు. తనూ ఓ నవ్వు నవ్వాడు. అంతలో వున్నట్టుండి ఎక్కడి నుండి వచ్చాడో ఒకడు 'మెరుపుతీగ' హ్యాండ్ బాగ్ లాక్కొని పారిపోయాడు. వెంటనే సుబ్బారావు గాబరా పడిపోయాడు. ఒక్కసారి హెల్ప్ హెల్ప్ అంటున్న ఆమె వంక చూసి ఒలింపిక్ రేస్‌లో పరిగెట్టేవాడిలా దొంగ వెనక పడ్డాడు సుబ్బారావు. కొంతదూరం వెళ్లగానే మన సర్కారు వారు వేయించిన గతుకుల రోడ్డులో నిలిచిపోయిన వాన నీటి గుంటలో పడ్డాడు సుబ్బారావు. కొద్దిసేపు కుడితిలో పడ్డ ఎలుకలా కాళ్లూచేతులు ఆడించి గుంటనుండి పైకి లేచి మురికి బట్టలతోనే దొంగ వెనక పడ్డాడు మళ్లీ.

రోడ్డుకు అడ్డంగా (ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్స్‌లా అడ్డం వస్తున్న గేదెలను తిట్టుకుంటూ, వాటిని తప్పించుకుని ముందుకు పరిగెత్తాడు. ఆ పరిగెత్తడంలో ఎదురుగా వస్తున్న అరవై ఏళ్ల ఆవిడను గుద్దేశాడు. ఆమె 'అమ్మోలమ్మో! నన్ను చంపేశాడురో' అంటూ శోకాలు పెడుతూ రోడ్డు మీదే చతికిలబడిపోయింది. ఆమెను లేవదీయడానికి (ప్రయత్నించినా ఆమె అతని చేతులు విదిలించుకొని 'నేనిప్పుడు ఆస్పత్రికి ఎలా వెళ్లా(రో! నా ఎముకలన్నీ విరిచేశావు కదా అంట్ల వెధవా!' అని గట్టిగా అరుస్తున్న ఆమె చేతిలో ఒక పచ్చనోటు పెట్టి, 'మెరుపుతీగ' దగ్గర హీరో అనిపించుకోవడం ముందు ఇదెంత అనుకుంటూ మళ్లీ పరిగెత్తాడు. అంతలోనే దొంగ దూరంగా వెళ్లిపోయాడు. అయినా సరే చెట్టువదలని సారీ పట్టువదలని వి(క్రమార్కుడిలా వాడి వెంటపడి ఆఖరికి ఎలా అయితేనేం వాడిని పట్టుకుని, రెండు తన్ని బ్యాగ్ లాక్కున్నాడు.

దొంగ ఒక్కటి గట్టిగా సుబ్బారావు ముక్కు మీద కొట్టి మరీ పారిపోయాడు. అతని దెబ్బకు తుళ్లి (క్రిందపడ్డ సుబ్బారావుకి నడుం విరిగినంత పనైంది. అయినా బ్యాగ్ సాధించానని ఆనందంతో లేవబోయాడు కానీ నడుం సహకరించలేదు.

అంతలో హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకున్న మెరుపుతీగ చేతిలో మైకుతో అతని ముందు (ప్రత్యక్షమయ్యింది. కళ్లు ఇంతింత చేసి ఆశ్చర్యంగా చూస్తున్న సుబ్బారావును పళ్లన్నీ కనబడేలా క్లోజప్ యాడ్ ఇచ్చి, ''కం(గ్రాట్స్ సార్! మేము పెట్టిన పరీక్షలో మీరు నెగ్గారు. బైదిబై మేము 'ఊ' టీవీ నుండి వస్తున్నాం. ఈ (ప్రో(గ్రాం పేరు 'నడ్డి విరగొట్టుకునైనా నెగ్గరా డింభకా'. ఇంతకీ మీ పేరేంటండి సార్! ''సుబ్బారావు అబ్బా!'' అన్నాడు మూలుగుతూ.

''అబ్బా సుబ్బారావుగారూ''

''అబ్బా లేదు''

''ఓకే ఓకే సుబ్బారావుగారు! మీకు మేము పరీక్ష పెట్టి ఏం నిరూపించదలిచామంటే, ఈ హైటెక్కు కాలంలో కూడా అమ్మాయిలకు కష్టాల్లో హీరోల్లా కాపాడేందుకు (ప్రయత్నించే 'వె(రి వెంగళాయ'లు ఇంకా వున్నారని. దాన్ని మీరు నిరూపించారు. చాలా కష్టపడి ఈ విజయాన్ని సాధించినందుకుగానూ మీకు 'ఉత్తమ వె(రివెంగళప్ప' బిరుదు ఇస్తున్నామండీ! థాంక్యూ వెరీమచ్! ఒక్కసారి అందరూ సుబ్బారావుగారికి చప్పట్లు కొట్టండి! ఓకే! మళ్లీ వచ్చేవారం ఇంకొక వెంగళాయప్ప కోసం వెదుకుదాం అంతవరకూ శలవ్! బాయ్!'' చెప్పి వాళ్ల యూనిట్ వాళ్లతో సహా వ్యాన్ ఎక్కి వెళ్లిపోయింది.

ఇంకా ఆ షాక్ నుండి తేరుకోని సుబ్బారావును చూస్తూ, ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ అందరూ వెళ్లిపోయారు. వెళుతూ వెళుతూ ఒకాయన 'కం(గ్రాట్సండీ' అంటూ సుబ్బారావు చెయ్యి పట్టుకు ఊపేసాడు. తనకు టీవీలో కనబడే అవకాశం రానందుకు అసూయతో సుబ్బారావు చెయ్యి నొప్పి పుట్టేలా అతను ఊపడంతో ''అమ్మో! అయ్యో! చెయ్యొదలండి'' అంటూ గింజుకోసాగాడు సుబ్బారావు.

★ ★ ★

''అమ్మో నా చెయ్యి! అమ్మో నా నడుం'' అంటూ దొర్లుతూ మంచం మీద నుండి దభేలున పడ్డాడు సుబ్బారావు. తాడిచెట్టు మీద నుండి తాటికాయపడ్డ శబ్దం రావడంతో గభాల్న నిద్ర లేచింది సుబ్బారావు భార్య తాయారు. పక్కలో భర్త లేకపోవడం అటు ఇటూ చూసిన తాయారు (క్రిందపడి కొట్టుకుంటున్న భర్తను చూసి, ''అయ్యో! అదేమిటండీ! మంచం మీద నుండి (క్రిందపడి అలా మూర్ఛరోగిలా కొట్టుకుంటున్నారు. లేవండి! ఏమైందండీ'' అంటూ తట్టి లేపింది తాయారు.

రెండు దెబ్బలు గట్టిగా వేసాకగాని లేవలేదు సుబ్బారావు. భర్తను కొట్టినందుకు (ప్రాయశ్చిత్తంగా మంగళసూ(త్రాలను కళ్లకద్దుకుంది అభినవ సావి(త్రిలా!

పైకిలేచిన సుబ్బారావుకు మంచినీళ్లిస్తూ ''ఏమైందండీ! అలా అయ్యో అమ్మో అంటున్నారు'' (ప్రేమగా అడిగింది తాయారు.

ఆమె మాటకు సమాధానం చెప్పకుండా మంచినీళ్లు తాగుతున్న వాడల్లా కెవ్వున అరిచాడు.

''మళ్లీ ఏమైందండి!'' కంగారుగా అంది తాయారు!

''మంచినీళ్లలో బల్లి!'' అన్నాడు చెంబు దూరంగా పెడుతూ, గొంతులో పోసుకున్న నీళ్లు బయటకు ఊసేస్తూ!

''ఓస్ అంతేకదా! బల్లి విషం మీకో లెఖ్ఖ!'' తేలిగ్గా అంది తాయారు

''అంటే!'' కొద్దిగా ఉ(క్రోషంగా అన్నాడు సుబ్బు.

''అంటే ఏమీ లేదు మహా(ప్రభూ! ఏదో సరదాకి అన్నాను. ఇంతకీ మీరెందుకు కలవరించారు? ఏమైనా పీడకల వచ్చిందా!'' సుబ్బారావు జుట్టులోకి చేతులు పోనిస్తూ అంది తాయారు.

ఇంటికి పైకప్పులు వేటితో వెయ్యనా అని దీర్ఘంగా ఆలోచించేవాడిలా నోటి మీద రెండు మూడుసార్లు వేలితో కొట్టుకుని, ''ఆ! గుర్తొచ్చింది తాయారు అదంతా కలే అని, అయితే ఆ మెరుపుతీగ నిజం కాదన్నమాట'' అనుకున్నాడు స్వగతంలా.

కానీ ఆ మాట తాయారుకు వినిపించే వినిపించింది. స(రున సుబ్బారావు తలవెం(టుకలు ఊడేలా చేయి బయటకు తీసి, ''ఏ మెరుపుతీగండి! ఆ ఎదురింటి పద్మాక్షేనా? అది కలలోకి

కూడా వస్తుందా! నా మొగుడే దొరికాడా దానికి! పాలాల్లో దిష్టిబొమ్మ ముఖం అదీనూ! అయినా మీరూ సిగ్గులేకుండా దానివంక లొట్టలు వేసుకుంటూ చూస్తే అది మాత్రం రెచ్చిపోదా? పక్కన భార్య వుంటుండగానే వేరే దానితో కలల్లో తేలుతారా?'' అని ఉక్రోషంగా గట్టిగా సుబ్బారావు బుగ్గల్లో పొడిచి రాగాలు తీయసాగింది.

''తప్పు తాయారు! ఆవిడ అలాంటిది కాదు! పైగా నాకన్నా వయసులో పెద్దది'' తాయారు దెబ్బకు బుగ్గనొప్పి పెడుతుంటే చేత్తో రుద్దుకుంటూ అన్నాడు సుబ్బు.

''అంటే, వయసు తక్కువైతే మీకేం అభ్యంతరం లేదన్నమాట!''

''అయ్యో తాయారు! నువ్వు సరిగ్గా అర్థం చేసుకోకుండా గోల చేస్తున్నావు, అసలు ఆ మెరుపు తీగ...'' నచ్చచెప్పబోయాడు సుబ్బు.

సుబ్బారావు చెయ్యి ఒక్కసారిగా విసిరికొట్టి, ''మెరుపుతీగ! మెరుపుతీగ అంటూ అర్ధరాత్రి గోల చేస్తున్నది నేనా! రోజు కిటికీల్లోంచి అదీ, బాల్కనీల్లోంచి మీరూ చూస్తున్నదే గాక, ఇప్పుడు కల్లోకి కూడా వచ్చిందని నాతోనే చెప్తూ పైగా నాది గోల అంటారా? ఇప్పుడే మా పుట్టింటికి వెళ్లిపోతానుండండి'' ముక్కుచీదుతూ పైకి లేచింది తాయారు.

''ఇప్పుడు మీ ఊరు వెళ్లడానికి రైలు, బస్సు ఏముంటాయితాయారు!'' ఆమెను ఆపాలనే ఉద్దేశ్యంతో అన్నాడు సుబ్బు.


''అంటే! బస్సు, రైలు వుంటే వెళ్లిపోమనేగా మీ ఉద్దేశ్యం!'' కళ్లెర్ర చేస్తూ అంది తాయారు.

''అయ్యో!'' అని జుట్టు పీక్కోబోయి బార్బర్‌కి పనిలేకుండా పోతుందనే సహృదయంతో ఆగిపోయాడు.

తాయారు చేతులు పట్టుకొని, ''నేను చెప్పేది విను తారూ! సారీ తాయారూ! నువ్వనుకున్న ఆవిడ కాదు నా కల్లోకి వచ్చింది...''

''అంటే నాకు తెలియకుండా వేరే ఇంకొకర్తి కూడా వుందా? దేవుడా నా కొంపముంచేశావురో ఏడుకొండలవాడా! నీకు ఇద్దరు భార్యలు వుండడమేగాక నా భర్తకు కూడా ఇంకొకిద్దర్ని అంటగట్టాలని చూస్తున్నావా? ఈ విషయం నేను పద్మావతీ దేవితో మొరపెట్టుకుంటాను నువ్వు పర్మిషన్ ఇస్తే!'' శోకాలు పెడుతున్న తాయారును చూసి,

''తాయారూ, తాయారు! నేను శ్రీరాముని వంశానికి చెందిన వాడ్ని. నన్ను అనుమానించుట తగదు. నేను అలాంటి పొరపాటు చెయ్యను. చెయ్యలేదు, చెయ్యబోను'' నాటకఫక్కీలో అన్నాడు సుబ్బు.



డి. నాగజ్యోతి

''అంయితే మరి నిజం చెప్పండి! లేకపోతే మా గబ్బర్ అన్నయ్యకు కబురు పెడతాను'' బెదిరిస్తున్నట్టు అంది తాయారు.

కండలు తిరిగిన గబ్బర్‌గాడు గుర్తుకు రాగానే పేలవమైన నవ్వొకటి నవ్వి గబ్బర్ వస్తే తన పరిస్థితి ఏమిటో ఊహించుకొని,

''నీకు మొగుడంటే ఎంత ప్రేమే తారూ! గబ్బర్‌కి కబురంపుతావా? అవేమీ వద్దులే విషయం చెబుతాను''

''దేవుని సాక్షిగా అంతా నిజమే చెబుతాను అబద్ధం చెప్పనని నీ రెండు కాసుల బంగారపు గొలుసు మీద ప్రమాణం చేసి మరీ చెబుతున్నాను. జన్మ జన్మలకు నువ్వే నా ప్రేయసి!

ఊర్వశి!'' అసలైన నిజాయితీపరుడులా ఫోజు పెట్టి అన్నాడు సుబ్బారావు.

''అబ్బా ఆశ! ఈ బంగారు గొలుసు మా పుట్టింటి వాళ్లు చేయించింది. మీవాళ్లు కొన్న టీవీ మీద ఒట్టేసి చెప్పండి''

''అబ్బా! అలాగే తాయారు! ఎవరి వస్తువైతే ఏముంది! ఎమోషనల్ ఎఫెక్టు కోసం అలా అన్నాను అంతే''

''మీ ఎఫెక్టు ఏడ్చినట్టే వుంది అసలు విషయం చెప్పండి''

తన కలలో కనిపించిన మెరుపుతీగ, దొంగ, వాడిని పట్టుకోవడం, టీవీ వాళ్లు రావడం, తన నడుం విరగడం అన్నీ వదలకుండా చెప్పేశాడు సుబ్బు. తర్వాత 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు.



''ఆ మాయదారి టీవీ! అందులో ముప్పై రెండు పళ్లూ కనిపించేలా నవ్వే ఆ యాంకర్స్‌లో ఏ రబ్బరు బొమ్మనో ఊహించుకొని కలల్లో తేలుతున్నారన్నమాట'' అంతా విన్నాక కూడా తాయారు అలా అనడంతో-

''ఓరి దేవుడా!'' అంటూ బట్టబుర్ర అయిపోతుందని కూడా చూడకుండా ఈసారి నిజంగానే జుట్టు పీక్కున్నాడు పాపం భా.బా.సుబ్బారావు (భార్యా బాధితుడు).

విసురుగా వేరే గదిలోకి వెళ్లబోయి టక్కున ఆగిపోయి కెవ్వున కేక పెట్టింది తాయారు!

కంగారుగా ''ఏమైంది తాయారు'' అంటూ ఆమె వైపు పరిగెత్తి ఆమె వెనకే బిగుసుకుపోయి ఆగిపోయాడు సుబ్బారావు.

''ఊ! నడవండి వెనక్కి!'' అని ఉరిమాడు ఎదురుగా కత్తి పట్టుకు నిలబడ్డ దొంగ. బెదురుతూ గుమ్మానికి అడ్డం తప్పుకున్నారు ఇద్దరూ! 'మాయదారి మల్లిగాడు'లో కృష్ణలా ఫోజు పెడుతూ, లోపలికి వచ్చాడు దొంగ!

''మీరు..నువ్వు..మీరు'' తడబడింది తాయారు.

''ఆ..'' అని గట్టిగా ఉరిమి, ''కనిపించడంలా దొంగను!'' అహ్హహ్హా! అని మాయల ఫకీరు వేషంలో వున్న ఎస్వీఆర్‌లా నవ్వాడు. అంతలోనే సీరియస్‌గా ముఖం మార్చి కత్తి తిప్పుతూ సుబ్బారావును ''తాళాలెక్కడ?'' అని అడిగాడు. సుబ్బారావు తాపీగా ''ఏం బాబూ! దొంగతనానికి కొత్తా?'' అడిగాడు.

'వీడెలా కనిపెట్టా డబ్బా?' అని మనసులో అనుకొని ''ఏమిటా వెటకారం! నేనేమైనా నీ బామ్మర్దినా?'' గంభీరంగా అన్నాడు దొంగ.

''మరి లేకపోతే ఏంటయ్యా! తాళాలు ఎవరి దగ్గర వుంటాయి. అది కూడా తెలీలేదు కొత్తేమోనని అడిగాను'' సీరియస్‌గా అన్నాడు సుబ్బారావు.

దొంగ ఒక్కసారి గతుక్కుమని ''తిక్క తిక్క వేషాలు వెయ్యక ఆవిడ దగ్గర నుండి తాళాలు తీసుకొని ఇవ్వు'' అన్నాడు.

''మీరే తీసుకోవచ్చుగా మధ్యలో నేనెందుకు?''

''నేను ఆడవాళ్ల జోలికి వెళ్లను. పైగా మీ ఆవిడకు చెయ్యివిసురు ఎక్కువలా వుంది! అనుభవం నేర్పిన పాఠం కూడా! అధిక ప్రసంగం ఆపి, మర్యాదగా తాళాలు తీసుకో. లేకపోతే పొడిచేస్తా!'' కత్తి ఝుళిపిస్తూ అన్నాడు దొంగ.

తను భార్యాబాధితుడన్న సంగతి దొంగకు కూడా తెలిసిపోయింది అని తెగ బాధపడిపోతూ, '''తాయారూ! ఆ తాళాలు ఇటివ్వు! లేకపోతే దొంగగారు నన్ను పొడిచేస్తారంట!'' దీనంగా అన్నాడు సుబ్బు.

''పొడిస్తే పొడవనివ్వండి! నేను మాత్రం ఇవ్వను. బీరువాలో మా పుట్టింటి వాళ్లు ఇచ్చిన డబ్బు వుంది'' తాళాలు గట్టిగా పట్టుకుంటూ అంది.

''నేను నీ మంగళసూత్రాన్నే తాయారు!''

''అంతా అబద్ధం! ఇది మా పుట్టింటి వాళ్లు కొన్నది'' మంగళసూత్రం కళ్లకద్దుకుంటూ అంది.

''సూత్రం అంటే సూత్రాన్ని కాదే! నీ మొగుణ్ణే. వాడు సారీ వారు చంపేస్తానంటున్నారు''

''మొగుడుపోతే డబ్బిచ్చి ఇంకొకర్ని కొనుక్కోవచ్చు. డబ్బు పోతే... అమ్మో! అందుకే తాళాలు నేనివ్వను ఏం చేసుకుంటారో చేసుకోండి!'' ఖచ్చితంగా కళ్ళింతలు చేసి చెప్పింది తాయారు.

సుబ్బు పరిస్థితి చూసి సన్నగా నవ్వు

## దియా ఆశలు!

**దియామీర్జా నటించిన తొలిచిత్రం 'రెహ్‌నా హై తేరే దిల్ మే' నిర్మాతల గుండెల్లో ఉందిగానీ ప్రేక్షకుల గుండెల్లో ఉండలేకపోయింది. 'దీవానాపన్' చిత్రం కూడా ప్రేక్షకుల్ని సంతృప్తిపరచలేదు. ఇప్పుడు 'తుమ్‌కో నభూల్ పాయేంగే' చిత్రం మీదే ఆశలన్నీ పెట్టుకుంది దియా. ఆ సినిమా అయినా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందో లేదో!**

-మానస

కుంటూ-

''చూశారా దొంగగారూ! ఫినాయిల్లో పడ్డ ఎలుకలా అయ్యింది నా బ్రతుకు. దయచేసి మీరే తీసుకోండి'' దీనంగా అన్నాడు సుబ్బు.

''చుప్... ఆపండి మీ గొడవ! మర్యాదగా ఎవరో ఒకరు తాళాలు ఇస్తారా! లేక నన్ను ఇంత సేపు నిలబెట్టి న్యూసెన్స్ చేస్తున్నారని పోలీసులకు ఫోన్ చెయ్యమంటారా?'' గద్దించాడు దొంగ.

''అయ్యో దొంగగారు! అంత పని చెయ్యకండి. వాళ్ళొస్తే మిగిలిన సొమ్ము రికవరీల్లో కల్సిపోతుంది'' గాబరాగా అంది తాయారు.

''కాబట్టి మర్యాదగా మీ దగ్గరున్నవన్నీ ఇవ్వండి. ఊ.. త్వరగా! నాకింకా అవతలి కాలనీలో దొంగతనానికి టైం అవుతోంది''

''అలాగే దొంగగారు పదండి! బీరువా తెరుస్తాను దగ్గరుండి మీక్కావలసినవి తీసుకుందురు గాని'' అని బీరువా దగ్గరకు దారి తీసింది తాయారు.

''తాయారూ! నువ్వేనా ఇలా అంటున్నది! మన సొమ్మంతా ఆ దొంగగాడికి సారీ... ఆ దొంగ గారికి ఇచ్చేస్తావా? ఎంత త్యాగమూర్తివి తాయారు? నాకోసం ఇంత పెద్ద త్యాగం చేస్తున్నావా? నేను భరించలేను తాయారూ భరించలేను'' తలమీద చేయి పెట్టుకొని ఎన్టీఆర్ ట్రైపులో అన్నాడు సుబ్బారావు.

''మీ మొహం! య్యాక్టింగ్ ఆపండి! మీకోసం కాదు! ఇప్పుడే నాకు గుర్తుకు వచ్చింది. నా డబ్బంతా బ్యాంకులో వేసి, మీ గొలుసు, వాచీ, ఉంగరాలు మాత్రమే బీరువాలో వుంచానని'' అంది తాయారు.

''ఆ!'' నోరు తెరిచి వుండిపోయాడు సుబ్బారావు.

బీరువా తాళం తీసి పక్కకు తప్పుకుంది తాయారు! బీరువాలో వస్తువులు తీసుకోవడం కోసం వంగిన దొంగను పక్కనే వున్న రోకలి పుచ్చుకొని కొట్టబోతున్నంతలో ''స్టాప్!'' అంటూ అటకమీంచి ఎలుగుబంటిలా దూకింది ఒకామె. ఆమె కేకకు తాయారు రోకలి ఒక్కసారిగా క్రిందకు వదిలింది. అది పక్కనే వున్న సుబ్బు కాలిమీద పడింది. ''బాబోయ్'' అంటూ అరిచి కాలు పట్టుకున్నాడు సుబ్బారావు.

ఇంతలో క్రిందకు దూకిన అమ్మాయి చేతిలో మైకు పుచ్చుకొని, పళ్లన్నీ ఇకిలిస్తూ ''వెల్‌డన్ మిసెస్ సుబ్బారావ్‌గారు! మేము 'అర్ధరాత్రి' టీవీ నుండి వస్తున్నాం. ఈ దొంగగారూ మా టీవీ అతనే! అదిగో కెమెరా వారు! అర్ధరాత్రి దొంగ ప్రవేశిస్తే ఎలా ప్రవర్తిస్తారు అనే అంశంపై మేం 'దొంగతో దోబూచులాట' అనే ప్రోగ్రాం నిర్వహిస్తున్నామండి! అందులో భాగంగానే మేం మీ ఇంటికి రావడం జరిగింది. మీ ఆవిడగారు చాలా తెలివిగా దొంగగారిని కొట్టబోయారు! మీరు చాలా అదృష్టవంతులు. ఇలాంటి భార్య దొరికినందుకు! ఈ కార్యక్రమంలో ఇంత బాగా పాల్గొన్నందుకు మీకు థ్యాంక్స్ చెబుతూ ఇకనైనా సుఖనిద్ర పోవాలని దిండూ, పరుపు, రెండు సీసాల నిద్రమాత్రలు ఇస్తున్నాం! మీరు కాదనకుండా తీసుకోవాలి. రేపు అర్ధరాత్రి ఈ ప్రోగ్రాం మా టీవీలో వస్తుంది తప్పకుండా చూడండి! అంతవరకూ శుభరాత్రి'' అంటూ మెరుపులా దిండు, పరుపు, నిద్రమాత్రల సీసా అక్కడ పెట్టి, టీమ్‌తో సహా వెళ్లిపోయింది ఆమె!

ఆశ్చర్యం నుండి ముందుగా తేరుకున్న తాయారు ''ఈవిడేనా మీ మెరుపుతీగ'' అంటూ నవ్వడంతో సుబ్బారావు కూడా ఆమెతో శృతి కలిపాడు. ఇద్దరిమధ్యా వున్న అనుమానపు టీవీ తెరలు తొలగిపోయాయి.

కథ కంచికి కరెంటు వుంటే మనం టీవీకి.

*

